ఆంధ్రజ్యోతి ABN
We Report You Decide

# అమెరికాలో పెరుగుతున్న దారుణాలు

27-02-2017 23:00:59




**వాషింగ్టన్:** అమెరికాలో భారతీయులపై ఇటీవల దాడులు పెరిగిపోయాయి. కాన్సాస్ నగరంలో జరిగిన కాల్పుల సంఘటనలో శ్రీనివాస్ కూచిబొట్ల ప్రాణాలు కోల్పోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్ షిప్ కౌన్సిల్ జాతీయ సంఘానికి అధ్యక్షులు డాక్టర్. ప్రసాద్ తోటకూర అక్కడి వాస్తవ పరిస్థితులను వివరించారు.



ఇటీవల కాన్సాస్ నగరంలో జరిగిన కాల్పుల సంఘటన ఎంతో దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో ప్రాణాలను కోల్పోయిన శ్రీనివాస్ కూచిబొట్ల కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము. ఇదే సంఘటనలో గాయపడిన అలోక్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాము. తన ప్రాణాలు సైతం పణంగా పెట్టి ఎంతో సాహసోపేతముగా అలోక్ రెడ్డి ప్రాణాన్ని కాపాడిన ఇయాన్ గ్రిల్లాట్ కు మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇటీవల కాలంలో భారతీయ అమెరికన్లపై ఇలాంటి దాడులు జరగడం పెరుగుతున్నది. అమెరికా నేరచరిత్రను విశ్లేషిస్తే, దురదృష్టవశాత్తు ఇలాంటి దాడులు ఇటీవల కాలంలో కనీసం 15 వరకు సంభవించాయి. ఉదాహరణకు– జూన్ 2016 లో, ఓర్లాండో పల్స్ నైట్ క్లబ్ షూటింగ్ లో 50 మంది మరణించడం మరో 53మంది తీవ్రంగా గాయపడడం విచారకరం. డిసెంబర్ 2012 లో శాండీ హుక్ ఎలిమెంటరీ స్కూల్, కనెక్టికట్‌లో ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో 20 మంది పిల్లలు తో సహా మొత్తం 26 మంది చనిపోవడం అత్యంత బాధాకరం. చాలా సందర్భాల్లో మన అనేక మంది భారత అమెరికన్లు అర్ధరాత్రి వేళలో పెట్రోల్ బంకుల్లో పనిచేస్తుండగా దుండగులు జరిపిన కాల్పుల్లో తమ ప్రాణాలు కోల్పోయారు.

అమెరికాలో ఇటువంటి దారుణ మారణ కాండ తరచుగా జరగడానికి బహిరంగ మార్కెట్లో సులభంగా లభ్యమయ్యే తుపాకులు ప్రధాన కారణం. ఎటువంటి వ్యక్తిగత విచారణ లేకుండానే ఎవరైనా డబ్బులిచ్చి ఎప్పుడైనా ఏ తుపాకినైనా సులభంగా కొనుక్కోవడం, కొన్ని బలహీన క్షణాల్లో ఆ తుపాకిని యథేచ్ఛగా వాడడం ఈ ప్రమాదాలకు కారణం అవుతుంది. ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్ షిప్ కౌన్సిల్ జాతీయ సంస్థ తరపున, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు ముఖ్యంగా ఇటీవల యూఎస్ కాంగ్రెస్‌కు ఎన్నికైన మన భారత సంతతికి చెందిన– శ్రీమతి కమల హారిస్, శ్రీమతి ప్రమీల జయపాల్, శ్రీ రాజా కృష్ణమూర్తి, శ్రీ రో ఖన్నా, డాక్టర్. అమీ బెరాలకు ఈ దాడులను తీవ్రంగా పరిగణించి మున్ముందు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయవలిసిందిగా ప్రత్యేక లేఖలు రాశాము. అంతేగాక, గన్ లైసెన్సింగ్ విధానాన్ని పునఃసమీక్షించి తగిన మార్పులు చేయాలని సూచించాము. తనిఖీల తర్వాత మాత్రమే తుపాకుల కొనుగోలుకు అనుమతించే విధముగా చట్టాన్ని సవరించాలి. జాతి వివక్ష దాడులు పెరుగుతున్న కారణంగా జాతీయ స్థాయిలో జాతి వివక్ష పరిశీలన–నిరోధక కమిషన్‌ను ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారి పై తక్షణమే కఠిన శిక్షలు అమలుచేయాలని విజ్ఞప్తి చేశాము.

అమెరికాలో జరుగుతోన్న ఇలాంటి ఘటనలను నిశితముగా పరిశీలిస్తే భారతీయులంటే స్థానిక అమెరికన్లలో కరుడు గట్టిన జాతి విద్వేష వివక్ష ఒక ప్రధాన కారణమని కూడా తెలుస్తుంది. భారత అమెరికన్ల మీద ద్వేషం, కోపం, నిరాశలతో కొద్ది మంది జాత్యహంకార విద్వేషాన్ని పెంచుకున్నప్పటికీ, అమెరికన్ సొసైటీ లో చాలా మంచి కూడా ఉంది. ఇదే అమెరికన్ వ్యవస్థ వివిధ రంగాల్లో లక్షలాది మంది ప్రవాస భారతీయులకు ఉపాధి, ఉన్నత అవకాశాలు కల్పించడం, ముఖ్యంగా కార్పొరేట్ రంగంలో– సత్య నాదెళ్ల (మైక్రోసాఫ్ట్), సుందర్ పిచాయి (గూగుల్), ఇంద్రా నూయి (పెప్సి) మొదలైన పలు భారతీయ అమెరికన్లకు చాలా ఉన్నత స్థానాలను కల్పించింది. ఒక అమెరికన్ కరుడు గట్టిన కోపంతో కూచిబొట్ల ప్రాణాలను తీస్తే, పక్కనే ఉన్న మరో స్థానిక అమెరికన్ తన ప్రాణాలకు తెగించి అలోక్ రెడ్డి ప్రాణాలను కాపాడటమే అమెరికన్ల మంచితనానికి ముఖ్య ఉదాహరణగా చెప్పుకోవచ్చు. నా అభిప్రాయంలో అమెరికాలో నివసిస్తున్న భారతీయులు కొన్ని నిర్దిష్ట మార్గదర్శకాలను అనుసరిస్తే అమెరికా వంటి గొప్ప దేశంలో ఒక ప్రశాంతమైన జీవితం సాగించవచ్చు.

–డాక్టర్. ప్రసాద్ తోటకూర
**ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్ షిప్ కౌన్సిల్ జాతీయ సంఘానికి అధ్యక్షులు,**